క్లుప్తంగా

సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

మధురపూడి: ప్రజల ఆరోగ్యానికి కీడుచేస్తున్న సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) సీఐ కె.బంగార్రాజు తెలిపారు. ఇటీవల విజయవాడ జిల్లా టాస్క్‌ఫోర్స్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సారా లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. విస్తృతంగా దాడులు నిర్వహిస్తూనే, సారా తయారీకి ఉపయోగించే బెల్లం వ్యాపారులకు అవగాహన కల్పించి, బెల్లం విక్రయాలను నిలుపుదల చేస్తామన్నారు. అలాగే ప్రత్యేక గస్తీలు నిర్వహించడంతో పాటు, యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. గోకవరం మండలం తిరుమలాయపాలెం, యర్రంపాలెం తదితర గ్రామాల్లో దాడులు నిర్వహించి, పలువురు సారా విక్రయదారులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు.

నిస్వార్థ సేవలతో మంచి గుర్తింపు



ప్రభాకర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

పెదపూడి: విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామ పంచాయతీలో గత ఐదేళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ చేసిన మంగళంపల్లి వీవీఎస్ ప్రభాకర్‌కు అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందించిన ప్రభాకర్ సేవలు కొనియాడదగినవన్నారు. అనంతరం ప్రభాకర్‌కు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, అచ్చిరాజు, త్రినాథ్, ప్రసన్నకుమార్, యశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: మండలంలోని పీరారామచంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనులు చేపడుతున్న కారణంగా ఈ నెల 2వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

కోరుకొండ మండలంలో...

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల సబ్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 2న వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. గాడాల, నిడిగట్ల, పాలచర్ల, మధురపూడి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



తొస్సిపూడిలో సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడిలో షిర్డీ సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు యలమంచిలి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, లక్ష చామంతి పూజ, హోమం నిర్వహించారు. అనంతరం మల్లిడి రామమూర్తి పెద్ద, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. పూజల్లో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పట్టాభిషేకం..

- ఆనంద డోలికల్లో యువ హృదయాలు
- 'నన్నయ' వర్సిటీలో పట్టాల పండగ



ఆనందంలో యువ తరంగాలు



గోల్డ్ మెడల్‌తో పాటు పీజీ పట్టా అందుకున్న విజయలక్ష్మితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబ సభ్యులు

రాజానగరం: చదువులకు పట్టాభిషేకమిది.. నగర్వంగా జరుపుకొన్న పండగ ఇది. స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పట్టాల పండగ అత్యంత అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కులపతి హోదాలో ఈ స్నాతకోత్సవంలో పాల్గొని, తమకు పట్టాలు అందజేయడం జీవితంలో అద్భుత ఘట్టంగా నిలిచిపోతుందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పట్టాలు, పతకాలు అందుకున్న వారంతా ఆనంద డోలికల్లో తేలియాడారు. యూనివర్సిటీ ప్రాంగణంలో కేరింతలు కొట్టారు. స్నాతకోత్సవంలో పట్టాలు తీసుకోవడమే ఒక మధురమైన ఘట్టమైతే, గవర్నర్ చేతుల మీదుగా వాటిని అందుకోవడం మరచిపోలేనిదని చెప్పారు. ఈ జ్ఞాపకం కలకాలం గుర్తుండి పోతుందని అన్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

అద్భుత ఘట్టం..

ఈ స్నాతకోత్సవంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఎంఏ సోషల్ వర్క్ నుంచి పీజీ పట్టాతోపాటు గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. ఈ సమయంలో వేదిక ముంగిటే ఉన్న ఆమె తనయుడు, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆనంద పరవశితులయ్యారు. ఆరు పదుల వయసులోనూ తన తల్లి ఒక విద్యార్థిగా పీజీలో గోల్డ్ మెడల్ సాధించడం ఆదర్శనీయమే కాకుండా అద్భుత ఘట్టంగా ఆయన అన్నారు. ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ రాజశ్రీ, సోదరి సంహితలు విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు.

మరుపురాని రోజు ఇది



మాది ఏలూరు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెంట్‌మేరీస్ సెంటనరీ డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ప్రొఫెసర్ కావాలనేది నా లక్ష్యం. 2020లో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశాను. ఆ తరువాత యూనివర్సిటీలో స్నాతకోత్సవం జరుగలేదు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఈ రోజు పీజీ పట్టాను అందుకుంటానని అసలు ఊహించలేదు. జీవితంలో మధురమైన రోజు ఇది.

– శ్రీరాజ శృతి, లెక్చరర్, హైదరాబాద్

సగర్వంగా ఉంది..



పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందడం సర్వసాధారణం. అయితే ఆ పీహెచ్‌డీని రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అందుకునే అవకాశం లభించడం చాలా అరుదు. పీహెచ్‌డీ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పట్టా పొందాను. గవర్నర్ చేతుల మీదుగా పట్టాను తీసుకోవడం ఇంటిల్లపాదికి సగర్వంగా ఉంది. జీవితంలో మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోతుంది.

– సూరవరపు జయసాయిరజిత, గృహిణి, రాజమహేంద్రవరం

సమాజానికి ఉపయోగపడేలా..



2023 సెప్టెంబర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశాను. రీసెర్చ్ ద్వారా ఈ సమాజానికి నెట్‌వర్క్ సెక్యూరిటీలో ఉపయోగపడాలని భావిస్తున్నాను. ఈ రోజు గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటానని కలలో కూడా అనుకోలేదు. నిజంగా ఈ రోజును ఒక అద్భుతంగా భావిస్తున్నాను. జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

– కోంద్రు మౌనిక, కంప్యూటర్ ఇంజినీర్, రాజమహేంద్రవరం

ఇది మధుర జ్ఞాపకం



ఏ విద్యార్థికైనా డిగ్రీ, పీజీ పట్టాలను స్నాతకోత్సవంలో అందుకోవడం అంటేనే ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. అందులో రాష్ట్ర గవర్నర్ పాల్గొన్న స్నాతకోత్సవంలో పట్టాను అందుకోవడం మాటల్లో చెప్పలేని అనుభూతి. ఇది జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– ఆగంటి దేవిశైలజ, తెలుగు లెక్చరర్, రాజానగరం

చెప్పలేనంత ఆనందంగా..



ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ విభాగంలో పీజీ పూర్తి చేశాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీజీ పట్టాను అందుకోవడం చెప్పలేనంత ఆనందంగా ఉంది. సొంతంగా సాఫ్ట్‌వేర్ సంస్థ పెట్టాలనేది నా ఆశయం.

– విహారిక, హైదరాబాద్



ఉరిమే ఉత్సాహం

చదువుకున్న డిగ్రీలకు పట్టాలు చేతికి అందితే ఆ ఆనందం చెప్పలేనిది. వర్ణించరానిది. ఆ పట్టాభిషేకానికి చంటి బిడ్డలతో తల్లులు, వీల్‌చైర్‌లో దివ్యాంగులు ఇలా అనేక మంది నన్నయ వర్సిటీకి వచ్చి ఆనందం వ్యక్తం చేశారు. వర్సిటీ ఆవరణలో కేరింతలు కొట్టారు.

– రాజానగరం



డిగ్రీ పట్టా తీసుకునేందుకు వస్తున్న దివ్యాంగుడు



చంటి బిడ్డతో మహిళ

వైఎస్సార్ సీపీతో పేదల సంక్షేమం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పార్టీలోకి భారీగా చేరికలు

రాజానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమం అందిందని, అర్హులకు పథకాలు దరిచేరాయని రాజానగరం ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కలవచర్లలో రజక సంఘం అధ్యక్షుడు గంగరాజు, సుబ్బారావు, చల్లా వీరన్నల ఆధ్వర్యంలో జనసేన, టీడీపీలకు చెందిన సుమారు 60 మంది కార్యకర్తలు, నాయకులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను వేసి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ అభ్యర్థి ఎవరో చెప్పుకోలేని దుస్థితిలో నియోజకవర్గంలో ప్రతిపక్షాలు ఉన్నాయన్నారు. తిరిగి వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టంకట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కలవచర్లలో రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలు అందజేస్తామన్నారు. తద్వారా పేదల సొంతింటి కల నెరవేర్చుతున్నట్లు ఆయన అన్నారు. ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అడబాల చినబాబు, దాట్ల రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నీడన.. చల్లచల్లన



బొల్లెద్దుపాలెంలో పురాతన మర్రి చెట్టు

మధురపూడి: ఆ చెట్టుకు 130 ఏళ్ల చరిత్ర ఉంది.. అందుకే సందర్శకులను ఆకట్టుకుంటోంది.. కోరుకొండ మండలం బొల్లెద్దుపాలేనికి చెందిన వెంకటరత్నం తోటలో మర్రి చెట్టు చల్లని నీడనిస్తోంది. అనేక ఉద్యాన వనాల్లో ఈ తరహా చెట్లున్నప్పటికీ ఇంత వయసు గల చెట్లు లేవు. వందలాది ఊడలు ఈ చెట్టు సొంతం. వేసవిలో దీని నీడన చల్లదనాన్ని ఆస్వాదించడానికి ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. ఈ చెట్టు చుట్టూ దిమ్మెను కట్టడంతో ప్రకృతి ప్రేమికులు కూర్చవడానికి అనువుగా ఉంది. ఆదివారం, సెలవు రోజుల్లో ఇక్కడ రద్దీ ఉంటోంది. కోరుకొండ, పరిసర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఫొటోలు దిగడానికి అనేక మంది ఆసక్తి చూపుతున్నారు.

ఎస్‌కేఆర్‌లో వెబినార్

కంబాలచెరువు: స్థానిక శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి అధ్యక్షతన ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి నిర్వహణలో అన్లీషింగ్ పవర్ ఆఫ్ ఎంప్లాయిబులిటీపై ఇంటర్నేషనల్ వెబినార్ బుధవారం జరిగింది. వెబినార్ నిర్వహణకు అనుమతినిచ్చిన కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్, ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణలకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. వక్తలు మాట్లాడిన విషయంపై ఆంగ్ల అధ్యాపకుడు పీఎస్ఎస్ఎన్.దుర్గాప్రసాద్ విశ్లేషణ ఇచ్చారు. అధ్యాపకుడు కె.చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పనుల పరిశీలన



సీతానగరంలో సీతారామస్వామి ఆలయ పనులు పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

సీతానగరం: స్థానిక సీతారామస్వామి ఆలయ పనులు 80 శాతం పూర్తయ్యాయని దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆ పనులను ఆయనతోపాటు ఈఈ ఎస్.శివ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటవరం, సీతానగరంలలో ఆలయాల పనులు జరుగుతున్నాయన్నారు. సీతానగరంలో ఆలయం పనులు దేవదాయ, ధర్మదాయ శాఖ రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలతో జరుగుతున్నాయన్నారు. ఫ్లోరింగ్, ఫెన్సింగ్, రంగులు వేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సహకారంతో నిధులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యేతో ఆలయ కమిటీ సభ్యులు చర్చించిన తర్వాత ప్రారంభోత్సవ తేదీని నిర్ణయిస్తారన్నారు. ఆలయ అర్చకుడు ఆరాధ్యుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ ఎంపీడీఓ నరేష్‌కుమార్ బదిలీ

మధురపూడి: కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. మంగళవారం ఇక్కడి నుంచి ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన ఇక్కడ నాలుగేళ్లు బాధ్యతలు నిర్వహించారు. మండలాభివృద్ధికి విశేష కృషి చేసినట్లు కార్యాలయ అధికారులు, సిబ్బంది పేరొన్నారు. బదిలీపై వెళ్తున్న నరేష్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఎస్సైకు అభినందన

మధురపూడి: కోరుకొండ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆనందకుమార్‌ను బుధవారం ఎస్సీ సెల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కోరుకొండ మండల కో–ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కో–కన్వీనర్ తాతపూడి చక్రవర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పత్తి పాపారావు, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

సీతానగరం: చినకొండేపూడికి చెందిన చిడిపి శ్రావణ సంధ్య (22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. 2018లో శ్రావణ సంధ్యకు ఏసుతో వివాహమైంది. వీరికి కుమార్తె కుమారులు రుషి (5), ఆకాంక్ష (3) ఉన్నారు. మంగళవారం తన కుమార్తెకు జ్వరంగా ఉండటంతో సంధ్య భర్తతో కలసి స్థానిక ఆసుపత్రికి వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్లగా ఏసు బయటకు వెళ్తానని చెప్పడంతో ఇంటి వద్ద ఉండాలని సంధ్య కోరింది. అయినా భర్త బయటకు వెళ్లడంతో మనస్తాపం చెంది ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుందని ఎస్సై తెలిపారు. తహసీల్దార్ పాగిరి కృష్ణారావు పంచనామా నిర్వహించగా, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

శ్మశానంలో బోరుకు శంకుస్థాపన




బోరు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

గోకవరం: పెంటపల్లి గ్రామంలో శ్మశానవాటికలో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేస్తున్న బోరు నిర్మాణానికి బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ శ్మశానవాటిక నిర్మాణానికి ఎంపీపీ నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరు చేసిన ఎంపీపీ సుంకర శ్రీవల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గండికోట వెంకటరమణ, ఉప సర్పంచ్ దాకరపు ధర్మరాజు, బాదంపూడి ప్రకాష్, బోయినపల్లి గంగబాబు, గారబోయిన శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పండగ

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత



ఈలకొలనులో యానిమేటర్లను సత్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పండగలు ఏడాది పొడవునా జరుగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రుణమాఫీ నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం బుధవారం మండలంలోని జి.దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, ఎస్టీరాజాపురం, వడిశలేరు, ముకుందవరం, కోటపాడు గ్రామాల సర్పంచ్‌లు గోలి రమణ, మత్సా పద్మశ్రీ, ఏసులంక గంగాభవాని, చింతపల్లి సత్యనారాయణ, అడ్డాల పద్మ, కొల్లాటి శ్యామలావతి, గవరసాని లక్ష్మీదుర్గ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 80 లక్షల స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలకు రూ.25 వేల కోట్ల రుణమాఫీని నాలుగు విడతల్లో చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికే మూడు విడతల నిధులు విడుదల చేశామన్నారు. గత ప్రభుత్వాల వలే ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. అక్క చెల్లెమ్మల జీవితాల్లో మరిన్ని కాంతులు తీసుకురావాలని, వారి కుటుంబంలో సుస్థిరమైన ఆదాయం రావాలని, జీవనోపాధి మెరుగు పరచుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మకడుపులోని బిడ్డ నుంచి ఆప్యాయంగా ఆశీర్వదించే అవ్వ వరకూ ప్రతీఒక్కరి అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా యానిమేటర్లు, మహిళా శక్తి సంఘాల మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం యానిమేటర్లను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత, రైతు విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, మండల సమాఖ్య సభ్యులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం



గైట్ కళాశాలలో హెలీపాడ్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మాధవీలత





అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజానగరం: తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాలలోని హెలీపాడ్ వద్ద కలెక్టర్ కె.మాధవీలత, ఇతర జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలతో బుధవారం ఘన స్వాగతం పలికారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన 15వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు కులపతి హోదాలో గవర్నర్ విచ్చేశారు. స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజభరత్, రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, 'నన్నయ' వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, గైట్ కళాశాల ప్రతినిధులు ఉన్నారు.